క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం



చెక్కు అందిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

పెద్దవడుగూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్‌) పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మిడుతూరు గ్రామానికి చెందిన జెన్నే రాజశేఖర్‌ అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేటు ఆసుపత్రి లో చికత్స చేయించుకున్నాడు. సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.30 వేలు మంజూరైంది. బుధవారం సాయిప్రతాప్‌రెడ్డి బాధితుడి ఇంటికి చేరుకుని రూ.30 వేల చెక్కును అందించారు. ఈసందర్భంగా బాధితుడు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశాడు. కార్యక్రమంలో సర్పంచ్‌ రామాంజులరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్‌ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రి: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని యువనేత కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పెద్దపొలమడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గతంలో పాలించిన నాయకులు చేయలేని పనులను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేసి చూపిస్తున్నారన్నారు. ఈఓఆర్డీ జిలాన్‌ భాష, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ విజయ్య, సర్పంచ్‌ శ్రీనివాసులు, ఎంపీటీసీ రమాదేవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత బోరు నుంచి మున్సిపాలిటీకి నీరు



మధుసూదన్‌రెడ్డి బోరు పాయింట్‌ నుంచి ట్యాంకర్‌కు నీటిని తోడుతున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్‌ సీపీ జిల్లా నేత మధుసూదన్‌రెడ్డి అనంతపురం రోడ్డులో ఉన్న తన సొంత బోరు పాయింట్‌ నుంచి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేసుకోవడానికి మున్సిపల్‌ అధికారులకు అనుమతిచ్చారు. బుధవారం నుంచి మధుసూదన్‌రెడ్డి బోరు పాయింట్‌ నుంచి నీటిని ట్యాంకర్లతో సరఫరా ప్రారంభించారు. వారం రోజులుగా మున్సిపాలిటీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది.

దస్తావేజు లేఖరుల పెన్‌ డౌన్‌

గుత్తి: కార్డ్‌ ప్రైమ్‌ 2.0 సాఫ్ట్‌వేర్‌కు వ్యతిరేకంగా బుధవారం దస్తావేజు లేఖరులు, పెన్‌డౌన్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తాలేఖరులు మాట్లాడుతూ కార్డ్‌ప్రైమ్‌ సాఫ్ట్‌వేర్‌తో తాము ఉపాధిని కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌ రిజిస్ట్రార్‌ గురునాథంకు అందజేశారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో చౌడేశ్వరీదేవి

పెద్దవడుగూరు: మండలంలోని మల్లేనిపల్లిలో బుధవారం చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున 3 గంటల నుంచి చౌడేశ్వరీదేవి ప్రతిష్ట, నేత్రోన్మిళనం, ప్రాణప్రతిష్ట, కక్షజ్వాల, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, కుంభాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు సాయిప్రతాప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానంనిర్వహించారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయండి



బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏవో స్వాతి

గుంతకల్లు రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఏఓ కే.స్వాతి బ్యాంకర్లను కోరారు. బుధవారం ఆమె కెనరా బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్లను కలిసి కౌలు రైతుల సమస్యలు వివరించారు. ఆర్థికంగా నష్టపోయి కష్టాల్లో ఉన్న కౌలు రైతులకు సాధారణ రైతుల మాదిరిగానే రుణ సదుపాయం కల్పించి వారికి ఆర్థిక తోడ్పాటును అందించాలని కోరారు. వివిధ గ్రామాల రైతులు, ఆర్బీకే సిబ్బంది ఆమె వెంటున్నారు.

బాబోయ్‌ కుక్కలు

- వార్డుల్లో శునకాల స్వైర విహారం
- హడలెత్తిపోతున్న ప్రజలు
- ఏటా పెరుగుతున్న కుక్కల సంతతి



ఏటిగడ్డ పాలెంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

తాడిపత్రి అర్బన్‌: పట్టణంలో రోజు రోజుకూ కుక్కల బెడద పెరిగిపోతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు తెగబడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని చింతలరాయుని పాలెం, కూరగాయల మార్కెట్‌, కాలువగడ్డ వీధి, నందలపాడు, పీర్లమాన్యం, జయనగర్‌కాలనీ, చేనేత కాలనీ, ఏటిగడ్డపాలెం, పోతులయ్య పాలెం, పోరాట కాలనీ, గాంధీనగర్‌ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. నిత్యం మనుషులు, చిన్నారులు, పశువుల పైనో దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఏటేటా పెరిగిపోతున్న కుక్కల సంతతిని అదుపు చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌ కావడంతో కుక్కకాటు వల్ల రేబీస్‌ వ్యాధి వేగంగా సోకే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రాత్రి వేళల్లో అడుగు బయట పెట్టాలంటేనే భయం

రాత్రి వేళల్లో ఇంట్లో నుంచి బయటకు అడుగు పెట్టాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఇక చిన్నారులు ఒంటరిగా బయటకు పంపాలంటేనే బయపడుతున్నారు, రాత్రి పూట రోడ్లపై వెళ్లే వాహన చోదకులను వెంటపడి మరీ తరుముతున్నాయి. ఇవి ఎక్కడ కరుస్తాయో అనే భయంతో వాహన చోదకులు వేగంగా నడిపి అదుపు తప్పి పడిపోయి గాయాలపాలతున్నారు. వారం క్రితం రాత్రి 11 గంటల సమయంలో పట్టణానికి దంపతులు ద్విచక్ర వాహనంలో వస్తుండగా కాలువగడ్డ వీధిలో కుక్కలు తరమడంతో వాహనం వేగంగా వెళడంతో స్పీడ్‌ బ్రేకర్‌ అడ్డు వచ్చి అదుపుతప్పి కిందపడిపోయారు. భార్యకు ఎడమ కాలు విరగగా, భర్తకు కుడి చేయి విరిగింది, పాదాచారులు చేతిలో కర్ర లేకుండా ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. ఒక్కోసారి కుక్కలు వాటిలో అవే పోట్లాడుకుంటూ ఆ మార్గంలో వెళ్లే వారిపై పడి గాయపరుస్తున్నాయి. కుక్కల పోరాటంలో గాయపడ్డ కుక్కల గాయాలు పెరిగి అవి పిచ్చికుక్కలుగా మారుతున్నాయి. అవి ప్రజలు, పశువులపై దాడులు చేస్తున్నాయి. వేలాది రూపాయల విలువైన పశువులు ఈ కుక్కల వల్ల చనిపోతున్నాయి. పెన్నా నదిలో గేదెలను మేపేందుకు వెళ్లిన పశుకాపరులపై రెండు వారాల క్రితం కుక్కలు దాడి చేశాయి. ఈ క్రమంలో గేదెలు తిరగబడడంతో వాటిపై కూడా కుక్కలు దాడి చేశాయి. పట్టణంలోని 34 వార్డుల్లో సుమారు 2వేలకు పైగానే కుక్కలు ఉన్నాయని అంచనా. వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు



కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటాం. కుక్కలకు వ్యాక్సిన్‌ వేసి సంతానోత్పత్తి కలగకుండా చికిత్సలు చేయడం ఒక్కటే మార్గం. త్వరలో పట్టణంలోని కుక్కలన్నింటికి శస్త్ర చికిత్సలు చేసేందుకు చర్యలు చేపడుతాం. నియంత్రణతో పాటు రేబీస్‌ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటాం. – గుర్రం రవి, మున్సిపల్‌ కమిషనర్‌

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం



యాడికి: విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దృశ్యం

యాడికి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం టెన్త్‌ టాపర్లకు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన సుస్వాగత్‌కు రూ.8 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రమేష్‌కు రూ.6వేల నగదును తాడిపత్రి పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి, సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయమ్మ, పెన్షనర్ల సంఘం సభ్యులు కుళ్లాయిరెడ్డి, అశ్వత్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్‌: జక్కలచెరువు గ్రామంలో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు బుధవారం దాతలు బహుమతులను ప్రదానం చేశారు. తొండపాడు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన గ్రామానికి చెందిన రాజన్న కుమారుడు రాజ్‌కుమార్‌ 406 మార్కులు, దివాకర్‌ కుమార్తె పూజిత 402 మార్కులను సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ అర్చకులు పార్థసారథి, వెంకటరంగయ్యలు బహుమతులు ప్రకటించారు. సర్పంచ్‌ సుహాసిని, ఆలయ ఈఓ దేవదాసు, ఆలయ కమిటీ చైర్మన్‌ వేల్పుల సోమశేఖర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి



పుట్లూరులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి ఓబులమ్మ

పుట్లూరు: గ్రామ స్థాయిలో తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఓబులమ్మ బీఎల్‌ఓలకు సూచించారు. బుధవారం ఆమె మండలకేంద్రంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల జాబితాపై తనిఖీలు చేపట్టారు. మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్ల చేర్పులపై క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ మోహన్‌కుమార్‌, ఆర్‌ఐ క్రిష్ణప్ప, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యల్లనూరు: ఓటరు జాబితాలో అర్హులైన పేర్లను నమోదు చేయాలని డీఎల్‌డీఓ ఓబులమ్మ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలో బుధవారం డబుల్‌ ఎంట్రీలు, మృతుల ఓట్ల తొలగింపుపై విచారణ చేపట్టారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఓబులమ్మ మాట్లాడుతూ ఓటరు నమోదు పక్కాగా చేయాలన్నారు. తహసీల్దారు సుమతి, వీఆర్వో వినోద్‌ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్‌ ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్‌: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కాలనీలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో జేసీ సోదరులు ఏనాడు ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోలేదన్నారు. అర్హులను విస్మరించి కేవలం వారి అనుచరులకే సంక్షేమ పథకాలు అందించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల అందజేత

తాడిపత్రి: మండలంలోని ఇద్దరికి వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం రూ.1.12 లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను అందజేశారు. వీరాపురానికి చెందిన కర్రెప్ప, కొండేపల్లి కి చెందిన కృష్ణవేణిలకు రూ.1.12 లక్షల విలువ చేసే వారి ఇళ్ల వద్దే అందించారు.

పీహెచ్‌సీలో అద్దాల పంపిణీ

తాడిపత్రి: చుక్కలూరు పీహెచ్‌సీలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమం కింద జీపీఎంఓ మధుసూదన్‌రాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి కేశవానంద 294 మంది వృద్ధులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం జీపీఎంఓ కంటి ఆరోగ్య సంరక్షణ, నేత్ర దానం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది శాంతకుమారి, సాలమ్మ, ఎంఎన్‌ఓ బాషా, సూపర్‌వైజర్‌ సాల్మన్‌ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థి



విద్యార్థి మహేంద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్‌: కర్నూలు ఔట్‌డోర్‌ స్టేడియంలో జరిగిన ఇంటర్‌ డిస్ట్రిక్‌ స్పోర్ట్స్‌ చాపియన్‌ షిప్‌ పవర్‌ లిఫ్టింగ్‌ పోటీల్లో ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ లక్ష్మయ్య తెలిపారు. కర్నూలు జిల్లా ఒలింపిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పోటీల్లో మొదటి సంవత్సరం విద్యార్థి బి.మహేంద్ర ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. బుధవారం విద్యార్థిని ప్రిన్సిపాల్‌ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై చొరవ చూపండి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శంకర్రావు

గుంతకల్లు: రైల్వే పెన్షనర్ల సమస్యలపై అధికారులు చొరవ చూపాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్‌ యూనియన్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి, శంకర్రావు కోరారు. స్థానిక రైల్వే గ్రౌండ్‌ సమీపంలోని మజ్దూర్‌ యూనియన్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆల్‌ ఇండియా రైల్వే పెన్షనర్స్‌ వెల్ఫేర్‌ ఫెడరేషన్‌(ఏపీ) నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ అధికారులు పెన్షనర్లకు బాసటగా నిలవాలన్నారు. సీనియర్‌ డీపీఓ జయశంకర్‌ చౌహాన్‌, సీనియర్‌ డీఎఫ్‌ఎం ప్రదీప్‌ బాబు మాట్లాడుతూ పెన్షన్‌ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆల్‌ ఇండియా రైల్వే పెన్షనర్స్‌ వెల్ఫేర్‌ ఫెడరేషన్‌ గుంతకల్‌ డివిజన్‌ కమిటీని ఎన్నుకున్నారు. డివిజనల్‌ ప్రెసిడెంట్‌గా పరమేశ్వర రాజు(తిరుపతి), సెక్రటరీగా ఎస్‌.మస్తాన్‌ వలి(గుంతకల్లు), వర్కింగ్‌ ప్రెసిడెంట్లుగా అశోక్‌, ఓబుల రాజు, కోశాధికారిగా సాయిశేఖర్‌ తోపాటు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులను ఎన్నుకున్నారు. మజ్దూర్‌ యూనియన్‌ గుంతకల్లు ప్రధాన కార్యదర్శి విజయ్‌ కుమార్‌, కోశాధికారి శ్రీనివాస్‌ శర్మ పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి సహకరించండి

డివిజన్లో నెలకొన్న రైల్వే పరిధిలోని పలు సమస్యల పరిష్కారానికి సహకరించాలని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్‌ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జోనల్‌ ప్రధాన కార్యదర్శి శంకర్రావుకు విజ్ఞప్తి చేశారు. గుంతకల్లుకు విచ్చేసిన శంకర్రావును బుధవారం రాజశేఖర్‌ రెడ్డి మజ్దూర్‌ యూనియన్‌ కార్యాలయంలో కలిశారు. కర్నూలులో కోచ్‌ వ్యాగన్‌ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినా నేటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. రైల్వే జోన్‌ సాధన సమితి నాయకులు పవన్‌ కుమార్‌, జ్ఞానేశ్వర్‌ రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ తాగునీటి సౌకర్యం



వాటర్‌ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ భాస్కర్‌, ఆలూరు రమణారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని ప్రతి గ్రామానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పిస్తామని జెడ్పీటీసీ భాస్కర్‌, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత ఆలూరి రమణారెడ్డి పేర్కొన్నారు. సిద్దరాంపురంలో ఎమ్మెల్యే సూచనల మేరకు ఆలూరి రమణారెడ్డి రూ.లక్ష సొంత వాటర్‌ ప్లాంట్‌ను మరమ్మతు చేయించారు. బుధవారం వారు ప్లాంట్‌ను పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాలలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సర్పంచ్‌ కొండన్న, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ బయపరెడ్డి, నాయకులు చికెన్‌ నారాయణస్వామి, సాకే లక్ష్మి నారాయణ, పురుషోత్తం పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్‌: జక్కలచెరువులో బొలికొండ రంగనాథ స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించే కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్య లో హాజరయ్యారు. ఆలయ అర్చకులు పలుకూరి రవికుమార్‌, విజయ్‌, రఘు, లిఖిల్‌, నవీన్‌, ఉదయ్‌, చేతన్‌ వేకువ జాము నుంచి స్వామికి మహా మంగళహరతి, శాంతి హోమం, అభిషేకం, కాగడా హారతి, సంప్రోక్షణ, హోమం తదితర పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవితో రంగనాథుడికి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. గుత్తి మునిసిపల్‌ చైర్‌ పర్సన్‌ వన్నూరుబీ, వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నేత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బేడల వెంకట్రాముడు, షఫీ పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈఓ దేవదాసు, ఆలయ కమిటీ చైర్మన్‌ వేల్పుల సోమశేఖర్‌ యాదవ్‌, సర్పంచ్‌ సుహాసిని, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజన్న, ఇబ్రహీం, రంగస్వామి, బుగ్గయ్య, గోపాల్‌ ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

కసాపురం దేవస్థానంలో ఘర్షణ

గుంతకల్లు రూరల్‌: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం ఆలయ ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు, ఏజెన్సీ నిర్వాహకులకు మధ్య ఘర్షణ జరిగింది. వివరాలు.. దేవస్థానంలో పవన్‌ సెక్యూరిటీ ఏజెన్సీస్‌ ఆధ్వర్యంలో ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు కొన్ని నెలలుగా తమకు 75 శాతం జీతం మాత్రమే ఇస్తున్నారని, నెలనెలా ఇవ్వడం లేదని బుధవారం ఆలయ ఈవో డీ.వెంకటేశ్వరరెడ్డి, ఏఈవో ధనుంజయకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీకాంత్‌రెడ్డి, ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. అక్కడే ఉన్న అధికారులు సర్ది చెప్పారు. అనంతరం కసాపురం ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులు పోలీస్‌స్టేషన్‌లో ఏజెన్సీ నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా విజయగణపతి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: స్థానిక సాయినగర్‌లోని బలిజ కల్యాణ మండపం ఆవరణలో విజయ గణపతి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి వేదపండితులు, అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు అనంతరం విగ్రహ దాతలు పూల రామాంజనేయులు, పద్మావతి నేతృత్వంలో విజయగణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం వందలాది మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. బలిజ సంఘం పట్టణాధ్యక్షుడు పూల రమణ, నాయకుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు

బీమా చెక్కు అందజేత



రూ.2 లక్షలు చెక్కు అందిస్తున్న మేనేజర్‌ సత్యనారాయణమూర్తి

శింగనమల: ఉల్లికల్లుకు చెందిన వడ్డే గౌరీశంకర్‌ కుటుంబ సభ్యులకు బుధవారం సలకంచెర్వు ఎస్‌బీఐ మేనేజర్‌ సత్యనారాయణమూర్తి రూ.2 లక్షల బీమా చెక్కు అందించారు. గౌరీశంకర్‌ ఈ ఏడాది మే 28న పిడుగుపాటుతో మృతి చెందాడు. మృతుడు పీఎంజేజేబీవై కింద బీమా చేయడంతో రూ.2 లక్షలు మంజూరైంది.

టెక్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని గౌతమిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ ప్రత్యూష

తాడిపత్రి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్‌ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన కబడ్డీ పోటీల్లో టెక్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థిని పి.గౌతమి ప్రతిభచాటింది. బుధవారం విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్‌ డాక్టర్‌ అశోక్‌ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ ప్రత్యూష బుధవారం అభినందించారు.

రాఘవేంద్రస్వామి ఆరాధన

తాడిపత్రి అర్బన్‌: పట్టణంలోని లలితాదేవి ఆలయం పక్కన నిర్మించిన రాఘవేంద్రస్వామి మఠంలో స్వామి 347 ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం ధ్వజారోహణంతో ఆరాధనోత్సవాలు ప్రారంభించారు. గురువారం పూర్వారాధన, శుక్రవారం మధ్యారాధన, శనివారం ఉత్తరారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

రైతు ఆత్మహత్య



మృతుడు సాంబశివారెడ్డి

నార్పల: దుగుమర్రి గ్రామంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి(42) తన కున్నా మూడెకరాల పొలంలో వివిధ పంటలు సాగు చేసేవాడు. పంటలు సరిగా పండకపోవడంతో దాదాపు రూ.9 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, భార్య సుజాత ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌పీసీఐ చేయించుకోండి

శింగనమల: ఉపాధి హామీ కూలీలు జాబ్‌కార్డుకు, ఆధార్‌కు, బ్యాంక్‌ ఖాతాకు ఎన్‌పీసీఐ చేయించుకోవాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి సూచించారు. మండలంలో 538 జాబ్‌కార్డులకు ఎన్‌పీసీఐ చేయించుకోలేదన్నారు.

విద్యార్థుల శ్రమదానం

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోని ముళ్లకంపలు, చెత్తాచెదారం తొలగిచారు. ప్రిన్సిపాల్‌ సుభద్రమ్మ, ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ బీ వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌ బీమా తక్షణసాయం అందజేత

పామిడి: పీ కొండాపురం గ్రామానికి చెందిన ఎం రామకృష్ణ భార్య సుంకురత్నకు బుధవారం వైఎస్సార్‌సీపీ బీమా తక్షణ సాయం అందజేశారు. రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్‌ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను వైఎస్సార్‌ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌ మునగల రంగనాయకులు సుంకురత్నకు అందించారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుత్తి: పట్టణంలో న్యాయవాదులు బుధవారం విధులను బహిష్కరించారు. అనంతపురం ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్‌ జడ్జి తీరును నిరసిస్తూ విధుల బహిష్కరించినట్లు వారు పేర్కొన్నారు.

చోరీపై కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో రెండిళ్లలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన చోరీ ఘటనపై బుధవారం సీఐ వెంకటరామిరెడ్డి కేసు నమోదు చేశారు. వార్డు వలంటీర్‌ రవి కుమార్‌, అర్చకులు రంగనాయకులు ఇళ్లలో గుర్తు తెలియని దొంగలు రూ.1.5 లక్షల నగదుతో పాటు 3 తులాల బంగారు చైన్‌, 2 బంగారు ఉంగరాలు, 3 జతల బంగారు కమ్మలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే.

ఏపీటీఎఫ్‌ మండల కమిటీ ఎన్నిక

శింగనమల: ఏపీటీఎఫ్‌ మండల కమిటీ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా సీ.రాజేంద్రకుమార్‌, అధ్యక్షుడిగా ఏ.శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె.రామూర్తి, జిల్లా కార్యదర్శిలుగా కె.సూర్యనారాయణ, డి.రామదాసు, టి.ఫకృద్దీన్‌, బి.వన్నూరప్ప, డి.బాబు, ఎల్‌.సత్యవతి, ఉపాధ్యక్షులుగా కె.రమేష్‌, జే.నీలవేణి, ఈ.సాంబశివుడు, పి.కులశేఖర్‌రెడ్డి, బి.అనురాధ, జీ.నాగభూషణం, సహాయ కార్యదర్శిలుగా బి.బాలసుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసులు, బి.పుష్పలత, వై.వి.యకుమార్‌, యు.సుధాకర్‌, మెంబర్లుగా ఎం.హేమలత, ఎస్‌. ఫమిద, ఎం.బాలనల్లప్ప, బి.ఉషారాణి, ఆడిటర్లుగా కె.మల్లికార్జున, సీ.కుళ్లాయప్ప, ఎస్‌. ఫర్హానాను ఎన్నుకున్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

గుత్తి: మహిళను అసభ్యంగా దూషించిన కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడింది. వివరాలు..పెద్దవడుగూరు మండలం రాంపురం గ్రామానికి చెందిన బొప్పెల వీరమ్మను అదే గ్రామానికి చెందిన జయరాంరెడ్డి, ఆదెమ్మ, లక్ష్మిరెడ్డి పొలం విషయంలో దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో బుధవారం గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి దీప్తి ముగ్గురికి నెల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్‌ నాగమాణిక్యం, ఏపీపీ హరి ప్రసాద్‌, కోర్టు కానిస్టేబుల్‌ మారుతి ప్రసాద్‌ను ఎస్పీ కే శ్రీనివాసరావు అభినందించారు.

మహిళ ఆత్మహత్య

పామిడి: ఓబుళాపురంలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన శివప్ప, వరలక్ష్మి (47) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నేళ్ల క్రితం శివప్ప మృతి చెందాడు. అప్పటి నుంచి కుమారుడు సోమశేఖర్‌, కుమార్తె రాధిక బాగోగులను వరలక్ష్మినే చూసుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో క్యాన్సర్‌ బారిన పడిన ఆమె పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించింది. అయినా జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకుని బుధవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పామిడి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.